ఎన్నికల ప్రలోభాలపై ఐటి కన్ను

- రూ.పది లక్షలు దాటితేనే ఐటి పరిధిలోకి...
- అంతకంటే తక్కువుంటే జిల్లా ఎన్నికల అధికారి పరిధి
- వివరణ ఇచ్చిన ఐటిశాఖ డిజి సంజయ్ బహదూర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా తరలించే నగదు, బంగారం, వజ్రాలు తదితరాలపై ఆదాయపన్ను శాఖ (ఐటి) ప్రత్యేక దృష్టి సారిస్తుందని హైదరాబాద్ శాఖ డైరెక్టర్ జనరల్ సంజయ్ బహదూర్ తెలిపారు. దీనికోసం 250 మంది సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. తనిఖీల్లో రూ.పది లక్షల కంటే ఎక్కువ మొత్తంలో పట్టుబడితేనే ఆదాయపన్ను శాఖ పరిధిలోకి వస్తుందని, అంతకంటే తక్కువ సొమ్ము అయితే జిల్లా ఎన్నికల అధికారి పరిధిలో ఉంటుందని వివరణ ఇచ్చారు. బ్యాంకుల్లో ఏకమొత్తంలో డిపాజిట్లు, విత్‌డ్రాలపై తమ శాఖ ఇంటలిజెన్స్ విభాగం నిఘా ఉంటుందని తెలిపారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రూ.20 కోట్లు స్వాధీనం చేసుకున్నామని, ఆయా కేసులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని బుధవారంనాడిక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ఇప్పటి వరకు పోలీసులు, ఎయిర్‌పోర్ట్ అథారిటీతో పాటు వివిధ శాఖలు అందించిన సమాచారంతో రూ.53.93 కోట్లు సీజ్ చేశామని, దానిలో 10.99 కోట్లు సరైన కారణాలు చూపడంతో రిలీజ్ చేశామని చెప్పారు. ఎన్నికల అఫిడవిట్లలో అభ్యర్థుల ఐటీ రిటర్న్‌తో పాటు ఎన్నికలు ముగిసాక ఆరు నెలల లోపు సమర్పించే ఖర్చుల వివరాలను సైతం తమ శాఖ మదింపు చేస్తుందని తెలిపారు. తమ శాఖ స్వయంగా నిర్వహించిన తనిఖీల్లో ఇప్పటి వరకు 1.76 కోట్లు సీజ్ చేశామన్నారు. ఎన్నికల్లో నగదు రవాణా, బదిలీని నివారించేందుకు, సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ప్రత్యేక యాప్ ద్వారా సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలికి చేరేందుకు క్విక్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎయిర్‌పోర్టు తనిఖీల్లో భాగంగా ఎయిర్ ఇంటలిజెన్స్ యూనిట్స్ (ఎఐయు) ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్‌లోని అయ్యకార్ భవన్ ఆదాయపన్ను శాఖ కార్యాలయం మొదటి అంతస్తులో 24/7 పనిచేసే ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, ఎన్నికల్లో డబ్బు, అభరణాలు, బంగారం, వెండి, వజ్రాల వినియోగం గురించి సమాచారం ఉంటే ప్రజలు ఇక్కడ ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. దానితోపాటు టోల్ ఫ్రీ నెంబర్ 1800-425-1788 లేదా ల్యాండ్‌లైన్ నెంబర్లు 040-23426201/23426202కు ఫోన్ చేసి సమాచారం తెలుపవచ్చన్నారు. అలాగే వీడియోలు ఇతర సమాచారం ఉంటే 7013711399 నెంబర్‌కు వాట్సప్ చేయాలనీ, ఇతర ఫిర్యాదులను cleantelangana-elections@incometax.gov.in కు మెయిల్ చేయొచ్చని చెప్పారు. సమావేశంలో ఆదాయపన్ను శాఖ హైదరాబాద్ విభాగం అడిషనల్ డైరెక్టర్ (ఇన్వెస్టిగేషన్), ఎన్నికల నోడల్ ఆఫీసర్ ఎమ్ కార్తిక్ మాణిక్యం, అడిషనల్ డైరెక్టర్ (హెడ్‌క్వార్టర్స్) జి రాఘవేంద్రరావు, పిఐబి అడిషనల్ డైరెక్టర్ జనరల్ శృతిపాటిల్ పాల్గొన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఐటిశాఖ డిజి సంజయ్ బహదూర్

బిఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్

- సోషల్ మీడియా వార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కారు, హస్తం మధ్య ఎన్నికల వేడి రాజుకుంటోంది. ఆ రెండు పార్టీల మధ్య సోషల్ మీడియా వార్ నడుస్తున్నది. మంత్రి కెటిఆర్, టిపిసిసి అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి ట్విట్టర్ వేదికగా విమర్శలు, ప్రతివిమర్శలు కాకపుట్టిస్తున్నాయి. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కరెంట్ ఇవ్వడం లేదంటూ కొంత మంది రైతలు మొసలిని తీసుకొచ్చి సబ్‌స్టేషన్‌లో వదలాలా? అన్న వైరల్ వీడియోను మంత్రి కెటిఆర్ ట్వీట్ చేసిన సంగతి తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ వినూత్నంగా స్పందించింది. ఈ క్రమంలో బిజెపి-బిఆర్ఎస్ పార్టీలు రెండూ ఒక్కటే అనే విషయాన్ని జనాల్లోకి తీసుకెళ్లడానికి కాంగ్రెస్ గట్టి ప్రయత్నం చేసింది. వినూత్నంగా ఆలోచించింది. 'బిజెపి- బిఆర్ఎస్‌ల లగ్గం పిలుపు' పేరుతో కాంగ్రెస్ పార్టీ పెండ్లి కార్డును విడుదల చేసింది. తెలంగాణ అమరవీరుల ఆత్మఘోశ అంటూ కార్డులో పేర్కొంది. ఇప్పటికే ఆ కార్డు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది.

నియోజకవర్గాలకు చేరుకున్న ఇవిఎంలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

వచ్చే నెల 30న జరిగే శాసనసభ ఎన్నికలకు వినియోగించనున్న ఇవిఎంలు బుధవారం షాద్‌నగర్ చేరుకున్నాయి. నియోజకవర్గంలో మొత్తం ఆరు మండలాలు ఉండగా 2,25,470 మంది ఓటర్లున్నారు. వీరు ఓటు వేసేందుకు అధికారులు 252 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఈ బూత్‌లలో వినియోగించేందకుఉ 310 ఇవిఎంలను ఎన్నికల సంఘం అధికారులు తీసుకువచ్చారు. అన్ని రాజకీయ పార్టీల ఇన్‌చార్జీలతో పాటు ఇఆర్ఒ మాధవరావు, ఎసిపి రంగస్వామి, తహసీల్దార్ పార్థసారథి సమక్షంలో పట్టణంలోని మినీ స్టేడియంలో ఇవిఎంలను భద్రపర్చి గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన 396 ఇవిఎంలు, 446 వివి ప్యాడ్‌లు కూడా ఇబ్రహీంపట్నానికి చేరుకున్నట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి తెలిపారు. వాటిని మంగల్‌పల్లిలోని సీవీఆర్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించినట్టు చెప్పారు.

బిజెపికి సహకరిస్తోన్న బిఆర్ఎస్ : సిపిఐ నారాయణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాజకీయాలపై సిపిఐ నారాయణ ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు అమలు చేయలేక పోయినందుకు బిఆర్ఎస్ నేతలు ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలన్నారు. బిఆర్ఎస్.. బిజెపికి పరోక్షంగా సహకరిస్తోందన్నారు. బిఆర్ఎస్‌పై కొట్లాడిన బండి సంజయ్‌ని బిజెపి రాష్ట్ర చీఫ్ పదవి నుంచి అన్యాయంగా తొలగించారన్నారు. రాష్ట్రంలో బిజెపిని ఓడించేందుకు పని చేస్తామని సిపిఐ నారాయణ స్పష్టం చేశారు.

ఓటరు కార్డులో తప్పులున్నా... ఆమోదించొచ్చు

- స్పష్టత ఇచ్చిన సిఇసి

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

శాసనసభ ఎన్నికలు స్వేచ్ఛగా, సక్రమంగా జరపడానికి ఓటర్లకు కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) మార్గదర్శకాలు జారీ చేసింది. అదేసమయంలో క్షేత్రస్థాయి పోలింగ్ అధికారుల సందేహాలకూ స్పష్టత ఇచ్చింది. పోలింగ్ సమయంలో ఒకరికి బదులు మరొకరు ఓటు వేయకుండా నిరోధిస్తూ, అసలైన ఓటర్లను గుర్తించాలని పేర్కొంది. ఓటు వేసే ముందు ఓటరు పోలింగ్‌స్టేషన్లోని అధికారులకు ఫొటోతో ఉన్న ఓటరు గుర్తింపు కార్డును చూపాలి. ఓటరు గుర్తింపు కార్డు లేకుంటే ఫొటోతో ఉన్న ఈ క్రింది ధృవీకరణ పత్రాలను చూపించొచ్చు. 1. ఆధార్ కార్డ్ 2. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డ్ 3. ఫోటోతో ఉన్న బ్యాంక్/పోస్ట్ ఆఫీస్ పాస్‌బుక్‌లు 4. కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డ్ 5. డ్రైవింగ్ లైసెన్స్ 6. పాన్ కార్డు 7. జాతీయ జనాభా రిజిస్టరు జారీ చేసిన స్మార్ట్ కార్డ్, 8. భారత పాస్‌పోర్ట్, 9. ఫోటోతో ఉన్న పింఛను పత్రం, 10. ఉద్యోగులకు కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు / ప్రభుత్వ సంస్థలు / పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఫోటో గుర్తింపు కార్డులు 11. చట్ట సభల సభ్యత్వాన్ని చూపే అధికారిక గుర్తింపు కార్డులు 12. దివ్యాంగుల గుర్తింపు కార్డులు చూపించొచ్చు. ఓటరు గుర్తింపు నిర్ధారణ సమయంలో క్లరికల్ తప్పులు, స్పెల్లింగ్ తప్పులవంటి వాటిని పోలింగ్ అధికారులు విస్మరించాలని సిఇసి స్పష్టత ఇచ్చింది. మరొక అసెంబ్లీ నియోజకవర్గం రిజిస్ట్రేషన్ అధికారి జారీ చేసిన గుర్తింపు కార్డును ఓటరు చూపితే, ఆ ఓటరు పేరు పోలింగ్ స్టేషన్‌కు సంబంధించిన ఓటర్ల జాబితాలో ఉంటే, దాన్ని గుర్తింపుకోసం అనుమతించవచ్చని తెలిపింది. భారత పాస్‌పోర్ట్‌లోని వివరాల ఆధారంగా ఓటర్ల జాబితాలో నమోదైన ప్రవాస ఓటర్లను పోలింగ్ స్టేషన్‌లో, వారి అసలు పాస్‌పోర్ట్ ఆధారంగా మాత్రమే గుర్తించాల్సి ఉంటుందని, దీనికి ఇతర ఏ గుర్తింపు పత్రం పరిశీలించకూడదని స్పష్టత ఇచ్చింది. ఓటరు తన పోలింగ్ స్టేషన్, ఓటర్ల జాబితాలోని క్రమ సంఖ్యను, పోలింగ్ తేదీ, సమయంవంటి వివరాలు తెలుసుకోవడానికి వీలుగా 'ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్' జారీ చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. జాబితాలో ఉన్న ఓటర్లు అందరికీ పోలింగ్ తేదీకి కనీసం ఐదు రోజుల ముందు ఓటరు సమాచార స్లిప్ అందించాలని పేర్కొంది. ఓటర్ల గుర్తింపును నిర్ధారించడానికి ఓటర్ స్లిప్పులను అంగీకరించబోరని తెలిపింది.


ఇంజనీర్లతో చర్చిస్తున్న అనిల్ జైన్

మేడిగడ్డ సాంకేతిక అంశాలపై కేంద్ర బృందం ఆరా

- ఆనకట్ట నిర్మాణంలో లోపం లేదు - ఇఎన్‌సి మురళీధర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడిగడ్డ బ్యారేజీ కుంగిన వ్యవహారంపై కేంద్ర బృందం పర్యటన రెండో రోజు బుధవారం కొనసాగింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్ జైన్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ బుధవారం రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజనీర్లతో భేటీ అయింది. తెలంగాణ ఇఎన్‌సిలు మురళీధర్, నాగేంద్రరావు, వెంకటేశ్వర్లు, సిఎం ఒఎస్‌డి శ్రీధర్ దేశపాండే, ఎల్ అండ్ టి ప్రతినిధులు భేటీలో పాల్గొన్నారు. మేడిగడ్డ ఆనకట్ట కుంగిన వ్యవహారంపై ఇంజినీర్లతో కేంద్ర బృందం చర్చించింది. ఆనకట్టకు సంబంధించిన సాంకేతిక అంశాలపై విస్తృతంగా చర్చించింది. భేటీ అనంతరం తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ మురళీధర్ మాట్లాడుతూ.. "మేడిగడ్డ ఆనకట్ట నిర్మాణంలో లోపాలు లేవు. ఏడో బ్లాక్‌లో సమస్య వల్ల సెంటర్ పియర్ కుంగింది. ఎక్కడో చిన్న పొరపాటు జరిగింది. ఇసుక కారణంగా సమస్య వచ్చిందని భావిస్తున్నాం. బ్యారేజీకి సంబంధించి క్వాలిటీ ఆఫ్ శాండ్, క్వాలిటీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ అనుమతులు ఉన్నాయి. కాపర్ డ్యామ్‌కు వరద తగ్గాక నవంబర్ చివరలో ఘటనపై సమగ్ర పరిశీలన చేస్తాం" అని ఇఎన్‌సి పేర్కొన్నారు.



కర్ణాటక గోస తెలంగాణకు అవసరమా..?

- కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దు : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కరెంట్ విషయంలో కర్నాటక గోస తెలంగాణకు అవసరమా..? కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మూడు గంటల కరెంటే దిక్కు అవుతుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కెటిఆర్ అన్నారు. ఒక్క అవకాశం ఇవ్వమంటున్న కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దని కెటిఆర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పెద్దపల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణరెడ్డి, రామ్మూర్తి తమ మద్దతుదారులతో కలిసి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో వారిద్దరికి కెటిఆర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ "సొంతింటికి తిరిగి వచ్చిన సత్యనారాయణ రెడ్డికి శుభాకాంక్షలు. కాంగ్రెస్ పార్టీ ఎవర్నీ ఓన్ చేసుకోలేదు. అందరు నాయకులను దూరం చేసుకుంది. బిఆర్ఎస్ అంటే తెలంగాణ ప్రజల పార్టీ. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే సమస్యలన్నీ తొలగిపోతాయి. ఎస్ఆర్ఎస్‌పికి పునరుజ్జీవం పోసిన ప్రాజెక్టు కాళేశ్వరం. ఇవాళ వరద కాలువ సజీవంగా మారిందంటే కాళేశ్వరం వల్లే. పెద్దపల్లి నియోజకవర్గం కూడా సస్యశ్యామలంగా మారింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎక్కడ చూసిన పచ్చగా మారింది" అని స్పష్టం చేశారు. "50 ఏళ్ళుగా ఏమీ చేయలేని కాంగ్రెస్ మళ్లీ ఒక్క ఛాన్స్ అంటోంది. కర్ణాటకలో కరెంట్ రైతులు అరిగోస పడుతున్నారు. కాంగ్రెస్‌కు ఓటేసి తప్పు చేశామని కర్ణాటక ప్రజలు చెంపలేసుకుంటున్నారు. మొసళ్లను తీసుకెళ్ళి సబ్ స్టేషన్‌లో వదిలిపెట్టారు అక్కడి రైతులు. వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ చాలని రేవంత్ రెడ్డి అంటున్నాడు. పొరపాటున కాంగ్రెస్‌ను గెలిపిస్తే మూడు గంటల కరెంటే దిక్కు. రాష్ట్రంలో నీళ్లు, విద్యుత్ సమస్యను పరిష్కరించుకున్నాం. కాబట్టి ప్రజలు ఆలోచించి ఓటేయాలి. అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్ అమలు చేస్తాం. కెసిఆర్ భరోసా పేరిట కొత్త కార్యక్రమాన్ని అమలు చేస్తాం" అని హామీ ఇచ్చారు.

నేటినుంచి బడులు, కాలేజీలు పునఃప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ పాఠశాలలు, కాలేజీలు గురువారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. ఈ నెల 13 నుంచి 25 వరకు 13 రోజులుపాటు బడులకు సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. జూనియర్ కళాశాలలకు ఈ నెల 19 నుంచి 25 వరకు ఏడు రోజులు ప్రభుత్వం సెలవులిచ్చింది. దసరా సెలవుల అనంతరం గురువారం నుంచి పాఠశాలలు, కాలేజీల్లో తరగతులు ప్రారంభమవుతాయి.

అల్పాహారం అమలుపై అస్పష్టత

ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని ఈ నెల ఆరో తేదీన మంత్రులు టి హరీశ్‌రావు, పి సబితా ఇంద్రారెడ్డి రంగారెడ్డి జిల్లా రావిర్యాల జడ్‌పిహెచ్‌ఎస్‌లో ప్రారంభించారు. దసరా తర్వాత అన్ని పాఠశాలలకూ ఈ పథకాన్ని విస్తరిస్తామని ప్రకటించారు. గురువారం నుంచి బడులు పునఃప్రారంభమవుతున్నాయి. అయితే అన్ని పాఠశాలల్లో ఈ పథకం అమలుపై అస్పష్టత నెలకొంది. గురువారం నుంచి అన్ని బడుల్లో ముఖ్యమంత్రి అల్పాహార పథకం అమలుపై ఎలాంటి ఉత్తర్వులు విడుదల కాకపోవడమే ఇందుకు నిదర్శనం. దీంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. సెలవులు కావడంతో పాఠశాలల్లో అల్పాహారం వండే వంట కార్మికులనూ నియమించలేదు. విద్యాశాఖ అధికారులు బుధవారం రాత్రి నాటికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయకపోవడం గమనార్హం.

అధిష్ఠానం ఎక్కడ పోటీ చేయమంటే.. అక్కడే పోటీ

- నేడు రెండో జాబితా విడుదల..ఆరు స్థానాల్లో ఇబ్బందులు
- ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో



అధిష్ఠానం ఎక్కడ పోటీ చేయమంటే అక్కడ చేస్తానని ఎంపి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకు చెందిన నేతలు కాంగ్రెస్‌లో చాలా మంది చేరుతున్నారని గుర్తు చేశారు. తన సోదరుడు రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిక విషయం తనతో మాట్లాడలేదన్నారు. బుధవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ రెండో జాబితా పూర్తయిందనీ, గురువారం విడుదల అవుతుందన్నారు. ఆరు స్థానాల్లో మాత్రమే ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. అక్కడ ఇద్దరు ముగ్గురు పోటీ పడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ (సిఇసి) ఫైనల్ అయ్యేవరకు బయట మాట్లాడకూడదన్నారు. కర్నాటకలో హామీ ఇచ్చిన పథకాలు అమలు అవుతున్నాయని పేర్కొన్నారు. గతంలోనే కాళేశ్వరంపై విచారణ జరపాలని ప్రధానికి లేఖ రాసినట్టు తెలిపారు. వామపక్షాలకు నాలుగు సీట్లు అంటే తక్కువ కాదనీ, మిర్యాలగూడలోనూ అడిగారని, అక్కడ ఓటు ఎంత వరకు బదిలీ అవుతుందనేది చూడాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి 70 నుంచి 80 సీట్లు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పొత్తులపై బుధవారం సాయంత్రం క్లారిటీ వస్తుందన్నారు. రాహుల్ గాంధీ పేరు పలికే అర్హత కెటిఆర్‌కు లేదని చెప్పారు. రాహుల్ గాంధీ కుటుంబానికి ఇల్లు కూడా లేదన్నారు. ఇప్పుడు మీ ఆస్తులెంత కెటిఆర్ అంటూ కోమటిరెడ్డి ప్రశ్నించారు.

సమస్యలను పరిష్కరిస్తా

- లండన్ మేయర్ స్వతంత్ర అభ్యర్థి తరుణ్ గులాటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



లండన్ నగరం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే తన ముందున్న కర్తవ్యమని, వాటి పరిష్కారం కోసం మేయర్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్టు భారతీయ సంతతికి చెందిన తరుణ్ గులాటి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కన్జర్వేటివ్ పార్టీ మాజీ సభ్యులు గులాటీ మాట్లాడుతూ పార్టీల్లో ఉంటే విధానపరంగా నిర్ణయాలు తీసుకోవడంలో ఆంక్షలుంటాయని, అందుకే తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. లండన్ నగరం నిరుద్యోగం, తక్కువ ఆదాయం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నదని తెలిపారు. వీటితో పాటు విద్యాభ్యాసం కోసం వచ్చే భారతీయ విద్యార్థుల భద్రతా తన ప్రాధాన్యత అని తెలిపారు. లండన్ నగరంలో అన్ని దేశాల ప్రజలున్నారనీ, ఓటర్లలో నాలుగు నుంచి ఐదు శాతం మంది భారతదేశం నుంచి వచ్చిన ఓటర్లున్నారని చెప్పారు. బరిలో నిలుస్తున్న అభ్యర్థులు నచ్చక పోలింగ్ శాతం పడిపోతున్నదని, తాను నిలబడటం ద్వారా అదీ పెరుగుతుందని తెలిపారు. బిజెపి మహిళా విధానాలు, పరిశోధనా విభాగం ఇంచార్జి కరుణాగోపాల్ మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని నమ్మే భారతీయ సంతతికి చెందిన వాడిగా గులాటీకి ప్రతి ఒక్కరు మద్ధతివ్వాలని కోరారు.

మార్పుకోరుకుంటున్న హైదరాబాద్ ఓటర్లు

- గ్రేటర్‌లో పుంజుకుంటున్న కాంగ్రెస్
- కీలకం కానున్న 30లక్షల సెటిలర్ ఓట్లు
- బోర్లాపడ్డ బిజెపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యావంతులైన గ్రేటర్ ఓటర్లు ఈసారి మార్పు కోరుకుంటున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సిటీ ఓటర్లు బిఆర్ఎస్‌కు మద్దతుగా నిలిచారు. జిహెచ్‌ఎంసి ఎన్నికల నాటికి మారిన రాజకీయ పరిస్థితులు,స్థానిక సమస్యలు బిజెపికి కలిసొచ్చాయి. ఎవరూ ఊహించనివిధంగా ఓటింగ్ శాతం పెరిగింది. తర్వాత బిజెపి రంగు బైటపడటంతో పాటు అధికార బిఆర్ఎస్ వైఫల్యాలతో కాంగ్రెస్ పుంజుకుంటోంది. గ్రేటర్ హైదరాబాద్‌లో గతమెంతో ఘనంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ తిరిగి పూర్వవైభవంపైపు అడుగులేస్తోంది. జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో నగర ప్రజలు బిజెపి, బిఆర్ఎస్ వైపు మొగ్గుచూపినా ప్రస్తుతం హస్తం వైపు ఆకర్షితులవుతున్నారు. నగరంలో దాదాపు 30 లక్షలకు పైగా సెటిలర్ ఓటర్లున్నారు. ఈ ఎన్నికల్లో సెటిలర్ ఓటర్లు కీలకం కానున్నాయి. గత జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ హవా చాటుకున్నా ఇప్పుడా పరిస్థితులు లేవు. రోజురోజుకు రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. భారతీయ జనతాపార్టీ రాజకీయాలతో విసుగుచెందిన జిహెచ్‌ఎంసి ఓటర్లు కాంగ్రెస్‌వైపు చూస్తున్నారు. అదే సమయంలో బిఆర్ఎస్‌పై అసంతృప్తితోవున్న నగర వాసులు మార్పును కోరుకుంటున్నారు. శివారు నియోజక వర్గాల ఓటర్లు గతంలో బిఆర్ఎస్ మద్దతుగా నిలిచినా ప్రస్తుతం గంపగుత్తగా కాంగ్రెస్‌వైపు మళ్లాయి. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబును ఇబ్బంది పెడుతున్న వైసిపికి కెసిఆర్ మద్దతుతోపాటు కెటిఆర్ ఇటీవల చేసిన వాఖ్యలు కారణమవుతున్నాయి. మరో వైపు కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు నగర ప్రజల్లోకి వెళ్లాయి. ఆరు గ్యారెంటీలపై నగరంలో ప్రధానంగా చర్చించుకుంటున్నారు. ఇక మున్సిపల్ ఎన్నికల్లో సత్తాచాటిన బిజెపి చతికలపడింది. హుజురాబాద్ ఎన్నికలు, ఆ తర్వాత జరిగిన కార్నాటక ఎన్నికలతోపాటు తెలంగాణలో హఠాత్తుగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మార్పుతో బిజెపిలో ఒక్కసారిగా గందరగోళం ఏర్పడింది. తెలంగాణలో గోల్కొండ కోటపై కాషాయంజెండా ఎగురవేస్తామన్న కమలనాథులు అంతర్గత సమస్యలతో సతమతువుతున్నారు. ఇక బిఆర్ఎస్‌పై నగరవాసుల్లో అసంతృప్తి ఉంది. దాంతో నగరవాసులు మార్పును కోరుకుంటున్నారు. ఇవన్నీ కాంగ్రెస్‌కు కలిసిరానున్నాయి.

గ్రేటర్‌లో పాగాకు టిడిపి కసరత్తు

తెలంగాణ టిడిపి సైతం గ్రేటర్‌లో పోటీచేయాలని హడావుడి చేస్తోంది. పార్టీ బలంగావున్న నియోజక వర్గాల్లో పోటీచేయాలని కసరత్తు చేస్తోంది. ముఖ్యంగా సనత్‌నగర్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేర్‌లింగంపల్లి, మల్కాజ్‌గిరి, జూబ్లీహిల్స్, ఉప్పల్‌తోపాటు శివారు ప్రాంతాల్లో టిడిపికి క్యాడర్ ఉంది. గతంలో ఆ ఓట్లు బిఆర్ఎస్‌కు మళ్లినా ఈ సారీ ఎన్నికల్లో టిడిపికి మళ్లీ మొగ్గుచూపే అవకాశాలున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి 3.5 శాతం ఓట్లను సంపాదించుకుంది. దానికనుగుణంగా టిడిపి ముందడుగు వేయాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్‌లో అన్ని నియోజక వర్గాల్లో అభ్యర్థులను బరిలోకి దించాలని ప్రయత్నిస్తోంది. ఇప్పటికే అన్ని నియోజక వర్గాల నుంచి ఆశావాహుల నుంచి దరఖాస్తులను సేకరించారు. బలమైన నేతలను సైతం గుర్తించారు. అయితే ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి, జనసేనా కలిసి పోటీచేయనున్న తరుణంలో, తెలంగాణాలో సైతం పొత్తుల విషయంలో ఏవిధంగా ముందుకు వెళ్లాలో పార్టీ ఆధిస్థానం నిర్ణయం మేరకు ముందుకు వెళ్లాలని తెలంగాణ టిడిపి క్యాడర్ ఆలోచిస్తోంది. చంద్రబాబు జైల్లో ఉండడంతో అభ్యర్థులను ప్రకటించేందుకు కాస్త ఆలస్యమైనా, చంద్రబాబు నుంచి గ్రీన్ సిగ్నల్‌వస్తే అభ్యర్థులను ప్రకటించే అవకాశముంది. గ్రేటర్‌లో బాలకృష్ణతో ప్రచారం చేయించే యోచనలో ఉన్నారు. ఎలాగైనా గ్రేటర్‌లో పాగా వేసే యోచలనలో ఉన్న టిడిపి జనసేనా బిజెపితో సైతం పొత్తుపెట్టుకునే అవకాశముందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణలో ఈ మూడుపార్టీ పొత్తుపెట్టుకుంటే ఏపార్టీకి నష్టం, ఏ పార్టీకి లాభం అనే అంశాలు తెరపైకి వస్తున్నాయి.

బిఆర్ఎస్, ఎంఐఎం, బిజెపి ఒకే తాను ముక్కలు

- కాంగ్రెస్‌తో అవగాహనపై కొనసాగుతున్న చర్చలు
- కొత్తగూడెం, చెన్నూరు స్థానాలు ఇస్తామని ప్రతిపాదన : నారాయణ

ప్రజావక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్, ఎంఐఎం, బిజెపిలు ఒకే తాను ముక్కలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ విమర్శించారు. బిజెపికి వ్యతిరేకంగా బ్రహ్మాండంగా పోరాడతున్నట్టు ఎంఐఎం వ్యవహరిస్తున్నదని, కానీ గెలిపించేందుకే శాయశక్తులా కృషి చేస్తోందని అన్నారు. బిఆర్ఎస్ కూడా బిజెపితో లోపాయికారీగా రాజకీయ అవగాహన చేసుకుందని చెప్పారు. మద్యం కుంభకోణంలో ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి సిసోడియాను అరెస్టు చేసి, కవితను అరెస్టు చేయకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతో రాజకీయ అవగాహనపై చర్చలు కొనసాగుతున్నాయని అన్నారు. కొత్తగూడెం, చెన్నూరు అసెంబ్లీ స్థానాలు ఇస్తామంటూ కాంగ్రెస్ పార్టీ తమ జాతీయ కమిటీకి చెప్పిందన్నారు. అయితే అధికారికంగా ఇంకా ప్రకటించలేదని చెప్పారు. మునుగోడు నియోజకవర్గానికి సంబంధించి బహిరంగ ప్రకటలు వచ్చాయని, ప్రతి పార్టీలోనూ రకరకాల అభిప్రాయాలుంటాయని అన్నారు. అంతిమంగా పార్టీ ఓ నిర్ణయం తీసుకున్నాక అందరూ దానికి కట్టుబడి ఉంటారని భావిస్తున్నట్టు వివరించారు. అంతర్గతంగా ఎన్ని అభిప్రాయాలున్నప్పటికీ కమ్యూనిస్టు పార్టీ విధానాలను, పార్టీని ధిక్కరించి ఎవరు కూడా బయటికి వెళ్తారని తాను అనుకోవడం లేదన్నారు. హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు మోడీ వికృత చర్యలకు పాల్పడుతున్నారని, అడ్డదారులు తొక్కైనా సరే అధికారాన్ని దక్కించుకోవాలని చూస్తున్నారని చెప్పారు. బిజెపికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించే పార్టీలను కూడా ఓడించేందుకు తమ పార్టీ కుదిరిన చోట సర్దుబాట్లు, లేని చోట స్వంతంగా పోటీ చేస్తున్నట్టు వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతమున్న ఏడు స్థానాల్లోనూ ఎంఐఎం గెలిచే పరిస్థితి లేదని సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా అన్నారు.

నేడు మేడిగడ్డకు సిపిఐ బృందం

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా లక్ష్మీ బ్యారేజ్ పిల్లర్ కుంగిపోయిన ప్రాంతాన్ని పరిశీలించేందుకు సిపిఐ బృందం గురువారం మేడిగడ్డకు వెళ్లనుంది. ఆ పార్టీ జాతీయ కార్యదర్శులు కె నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా, కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి ఈ బృందంలో ఉన్నారు. అలాగే కరీంనగర్‌లో దెబ్బతిన్న మానేరుపై కేబుల్ బ్రిడ్జిని కూడా ఆ బృందం పరిశీలించనుంది. ప్రభుత్వ వైఫల్యం, నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపాలు, అధికారుల నిర్లక్ష్యం వల్లే పిల్లర్ కుంగిపోయిందనీ, కేబుల్ బ్రిడ్జీ దెబ్బతిన్నదని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్మీ బ్యారేజ్ కుంగిపోవడానికి విద్రోహ చర్యే కారణమని పోలీసులు చెప్పడాన్ని ఆయన తప్పుబట్టారు. నాగార్జున సాగర్, శ్రీశైలం, శ్రీరాంసాగర్ వంటి ప్రాజెక్టుల వద్ద నిరంతర పహారా ఉంటుందనీ, ఒకవేళ కాళేశ్వరం వద్ద అలాంటి పహారా లేకపోతే విద్రోహ చర్యకు పోలీసుల అసమర్థతే కారణమని చెప్పారు. లక్ష్మీ బ్యారేజీ కుంగిపోవడానికి కారణం కూడా రాహుల్ గాంధీని చేస్తారేమోనని నారాయణ ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వణుకుతున్న హనుమకొండ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హనుమకొండ వణికిపోతోంది. అక్కడ కనిష్ఠ ఉష్ణోగ్రత ఒక్కసారిగా 6.2 డిగ్రీలు తగ్గడమే ఇందుకు కారణం. ఇక్కడ రాత్రిపూట 22.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావాల్సి ఉండగా.. సోమవారం రాత్రి 16 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ఇక్కడే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయాయి. ఉత్తర దిశ నుంచి రాష్ట్రం వైపు గాలులు వీస్తుండటంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్‌లో సాధారణం కన్నా 1.7 డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గింది. రాజేంద్రనగర్, పటాన్‌చెరులలోనూ ఉష్ణోగ్రతలు పడిపోయాయి. ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మంలలోనూ స్వల్పంగా తగ్గాయి. మరోవైపు, కొన్ని ప్రాంతాల్లో పగలు వేడి, రాత్రి చలి వాతావరణం ఉంటోంది. మంగళవారం ఖమ్మంలో పగటిపూట సాధారణం కన్నా 3.8 డిగ్రీలు అధికంగా 35.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. భద్రాచలంలో 1.7, హైదరాబాద్‌లో 1.3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మహారాజశ్రీ అవనిగడ్డ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నెం.85/2022

బిట్వీన్:
దండమూడి నిర్మల ... వాది
మరియు
చంద్ర దుర్గ నాగవీరప్రసాద్ అండ్ 4 అదర్స్ ... ప్రతివాదులు

4వ రెస్పాండెంట్/4వ ప్రతివాది:-
అన్నే అరుణ భర్త సురేంద్రబాబు, హిందూ, వయస్సు 65 సం॥లు, నివాసం:-ప్లాట్ నెం.405, శ్రీనివాసా అపార్టుమెంట్స్, రోడ్డు నెం.5, కె.టి.ఆర్. కాలేజి, నిజాంపేట రోడ్డు, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం.

పై నెంబరు దావాలో 4వ ప్రతివాదికి దావా సమను మరియు **ఐ.ఎ.నెం.361/2022** నోటీసు నిమిత్తం ది.09-11-2023వ తేదికి శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. సదరు దావా **ఓ.యస్.నెం. 85/2022** మరియు **ఐ.ఎ.నెం.361/2022వ ది.09-11-2023వ తేదిన** పై కోర్టువారి ఎదుట మీరుగాని మీ న్యాయవాది ద్వారా గాని ఉదయం గం. 10-30.లకు హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపగలరు. లేనియెడల వాజ్యం మరియు ఐ.ఎ.నెం. **361/2022** మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చుటమైనది. ఈ పేపరు ప్రకటన శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం జారీ చేయటమైనది.

వాయిదా తేది:09-11-2023

ఇట్లు
శ్రీ ఇమ్మిడిశెట్టి లక్ష్మీనారాయణ,
అడ్వొకేటు,
అవనిగడ్డ-521121,
సెల్ నెం.9908160589

అవనిగడ్డ,
ది.24-10-2023

NOTICE OF SUMMONS (PUBLIC)
IN THE COURT OF THE HONOURABLE 1ST ADJ RANGA REDDY DIST . AT :: L.B.NAGAR
O.P. No. 95 OF 2023

BETWEEN:
Smt. PEDDIREDDY SUBHASHINI ... Petitioner
AND
Mr.MOHAMMED MOHSIN,
Occ: Driver . ...Respondent.

WHEREAS a Motor Accident has been filed by the petitioner against the Respondent and the as the same is pending for service of summons for the reasons the summons could not be served with the reason the person was not available in the address (as in the FIR and charge sheet) as per the postal comments. AND WHEREAS the counsel for the Petitioner requested the honorable court to substitution of summons through paper publication and as the court was pleased to direct to issue the same, this public notice is given now in compliance of that order. You, Mr.MOHAMMED MOHSIN, please take this notice in O.P.No. 95 of 2023 that this case is posted for your appearance before the honourabe 1st ADJ, LB Nagar on **10-11-2023** and you are hereby required to appear before the court at **10-30** AM on that day. Also note that if you file to appear on that day, you will be set ex-parte and the case will be heard and decided as per the evidence produced by the petitioner.
This notice of SUMMONS is accordingly given seeking your compliance.

NERUSU SRINIVASA RAO,
ADVOCATE
4-74/1, Dilsukhnagar. Hyd - 060,
Cell : 9848030913



లండన్‌లో శివ్ నారాయణ్ జ్యువెలర్స్ ప్రివ్యూ

హైదరాబాద్ : లండన్‌లో జరిగిన ప్రత్యేక ప్రివ్యూతో శివ్ నారాయణ్ జ్యువెలర్స్ అంతర్జాతీయ మార్కెట్లోకి ప్రవేశించినట్లు తెలిపింది. వాలెస్ కలెక్షన్ వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి సుధా రెడ్డి హాజరై సహ హోస్ట్‌గా వ్యవహరించారని పేర్కొంది. "శివ్ నారాయణ్ జ్యువెలర్స్ కేవలం ఆభరణాలు మాత్రమే కాదని, అభిరుచి, చరిత్ర, తరతరాలుగా సాగే కలల కథ అని ఆ సంస్థ ఎండి తుషార్ అగర్వాల్ పేర్కొన్నారు. తమ సంస్థ 10 గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ టైటిల్‌ను పొందిందని ఆయన గుర్తు చేశారు.



తూంకుంట నర్సారెడ్డికి షాకిచ్చిన కాంగ్రెస్ నాయకులు

- బిఆర్ఎస్, కాంగ్రెస్‌లో అసంతృప్తితో బిజెపిలో చేరిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, గజ్వేల్ కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డికి కాంగ్రెస్ అసంతృప్తి నాయకులు షాక్ ఇచ్చారు. కాంగ్రెస్ అసంతృప్తి నాయకులు బిజెపిలో చేరుతున్నట్లు బుధవారం ప్రకటించారు. పిసిసి డెలిగేట్ సభ్యులు మాదాటి జస్వంత్‌రెడ్డికి గజ్వేల్ అసెంబ్లీ కాంగ్రెస్ టికెట్ దక్కకపోవడంతో బిజెపిలో చేరుతున్నట్లు ప్రకటించారు.

ఆయనతో పాటు పార్టీ సీనియర్లు దేవేందర్‌చౌదరి, నాగరాజు ఈటల రాజేందర్ సమక్షంలో బిజెపిలో చేరారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గజ్వేల్, ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మెన్ గాడిపల్లి భాస్కర్, వర్గల్ మండలం సీనియర్ నాయకులు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ టేకులపల్లి రామ్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు హైదర్ ఇక్బాల్ బిజెపిలో చేరుతున్నట్టు తెలిపారు.

ఎవరి ఇష్టం వారిది...

- కోమటిరెడ్డి రాజీనామాపై బిజెపి నేతల స్పందన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బిజెపికి రాజీనామా చేయడంపై ఆ పార్టీ నేతలు బిజెపి ఎంపి, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్, మాజీ ఎంపి జితేందర్‌రెడ్డి బుధవారం స్పందించారు.

ఈ విషయంలో ఎవరి ఇష్టం వారిదని ఆ పార్టీ అన్నారు. బిఆర్ఎస్‌కు బిజెపి ప్రత్యామ్నాయం కాదన్న రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలను వారు ఖండించారు. వారు అనుకుంటే బిఆర్ఎస్‌కు బిజెపి పోటీ కాకుండా పోదని వ్యాఖ్యానించారు.

ఆర్మూర్‌లో 302 రైస్ కుక్కర్లు సీజ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల నేపథ్యంలో పోలీసులు, ఎన్నికల అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా అడ్డుకట్టవేయడానికి విస్తృత తనిఖీలు చేస్తూ ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదు, బంగారు, వెండిని సీజ్ చేస్తున్నారు. ఈ క్రమంలో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో రైస్ కుక్కర్లను తరలిస్తున్న వాహనాన్ని బుధవారం ఎన్నికల అధికారులు పట్టుకున్నారు. అందులో ఉన్న 302 రైస్ కుక్కర్లను సీజ్ చేసి స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ క్రమంలో రాష్ట్రంలో ఎన్నికల కోడ్ వచ్చిన అనంతరం రూ.300కోట్లకుపైగా సొత్తును తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటి వరకు రూ.307.02కోట్లు విలువైన నగదు, మద్యం, ఆభరణాలను పట్టుకున్నారు. అక్టోబర్ 9 నుంచి రూ.105.58 కోట్లను స్వాధీనం చేసుకున్నారు. రూ.13.58 కోట్ల విలువైన మద్యం, రూ.15.23 కోట్ల విలువైన మత్తు పదార్థాలు, రూ.145.67 కోట్ల విలువైన ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, ఓటర్లను ప్రభావితం చేసేందుకు సిద్ధం చేసిన రూ.26.93కోట్ల విలువైన ఇతర కానుకలను సైతం స్వాధీనం చేసుకున్నారు.

డిసెంబర్‌లో జైపూర్ జ్యువెలరీ ప్రదర్శన

హైదరాబాద్ : వచ్చే డిసెంబర్‌లో జైపూర్ జ్యువెలరీ షోను ఏర్పాటు చేస్తున్నట్లు జెజెఎస్ గౌరవ కార్యదర్శి రాజీవ్ జైన్ తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ.. ఈ రోడ్‌షోలో వివిధ నగరాల నుంచి పలువురు అభరణాల వర్తకులు జ్యువెలర్స్ హాజరయ్యారు. డిసెంబర్ 22 నుంచి 25వరకు జరగనున్న 21వ ఎడిషన్ ప్రదర్శనకు అంతర్జాతీయ వర్తకులు కూడా హాజరు కానున్నారన్నారు. దాదాపు 40వేల మంది సందర్శకులు హాజరు కావొచ్చున్నారు.

అమలుకాని మరబోట్ల చేపల వేట

- విద్యార్థులకు అందని ట్రిబుల్ ఐటీ
- ఊసే లేని పిజి, డిగ్రీ, కళాశాలలు
- నేడు అచ్చంపేట, వనపర్తికి సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



"శ్రీశైలం రిజర్వాయర్‌లో తెలంగాణ వాటా ఉంది.. అది ఎవడి అబ్బా జాగీర్ కాదు. అచ్చంపేట వనపర్తి జిల్లాల పరిధిలో ఉండే కృష్ణానదిలో మరబోట్లను ఉపయోగించి మత్స్య కార్మికుల చేపల వేట కొనసాగేలా చర్యలు తీసుకుంటాం.. వనపర్తిలో ట్రిబుల్ ఐటి ద్వారా ఈ ప్రాంత విద్యార్థులకు ఉన్నత సాంకేతిక విద్య అందిస్తాం. అచ్చంపేటలో 1.55 లక్షల ఎకరాలకు సాగునీరు అందించి ఈ ప్రాంత కరువును పారదోలే విధంగా చర్యలు తీసుకుంటాం" అని 2018లో అచ్చంపేట, వనపర్తి పట్టణాల్లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో కెసిఆర్ హామీ ఇచ్చారు. వీటిలో ఏ ఒక్కటీ అమలు కాలేదు. నేడు మళ్లీ అచ్చంపేట, వనపర్తి పట్టణాల్లో బహిరంగ సభల్లో పాల్గొనేందుకు కెసిఆర్ వస్తున్నారు. ఈ సందర్భంగా 'ప్రజాశక్తి' ప్రత్యేక కథనం.

ఐదు సంవత్సరాల కిందట 2018లో ముఖ్యమంత్రి కెసిఆర్ ఇదే నెలలో అచ్చంపేట, వనపర్తి పట్టణాల్లో జరిగిన బహిరంగ సభల్లో మాట్లాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో విశాలంగా ప్రవహిస్తున్న కృష్ణ, తుంగభద్ర నదులున్నాయి. వీటిని ఆధారంగా చేసుకొని శ్రీశైలం రిజర్వాయరును ఏర్పాటు చేశారు. శ్రీశైలంలో తెలంగాణకు వాటా ఉంది. అందుకే మర బోట్ల ద్వారా మత్స్య కార్మికులకు చేపలు పట్టేందుకు ఉపాధి కల్పిస్తామని సిఎం చెప్పారు. వేలాది మంది ప్రజల సాక్షిగా ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదు. సభకు వచ్చిన కెసిఆర్‌ను స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కొన్ని కోరికలు కోరారు. 1.55 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఉమామహేశ్వర ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేస్తారని చెప్పారు. మద్దిమడుగు దగ్గర కృష్ణానదిపై బ్రిడ్జి ఏర్పాటు ద్వారా ఇతర రాష్ట్రాలకు వందల కిలోమీటర్ల దూరం తగ్గించే అవకాశాలు ఉంటాయన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో పది వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. 1000 ఎకరాల్లో పారిశ్రామిక వాడను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎస్ఎల్‌బిసిలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయమైన ప్యాకేజీని అందజేస్తామన్నారు. లింగాలలో 83 సర్వే నెంబర్‌లో పట్టాలు ఇవ్వడమేగాక 95 సర్వే నెంబర్‌లో అమ్రాబాద్ రైతులకు హక్కులు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్‌సి నియోజకవర్గమైన అచ్చంపేటలో మెగా లెదర్ పార్క్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఈకో పార్కు ఏర్పాటు చేయడమేగాక అచ్చంపేట పట్టణంలో డిగ్రీ, పీజీ కళాశాలలు ఏర్పాటుచేసి ఉన్నత విద్యను అందిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారు. వనపర్తి బహిరంగ సభలో నిరుద్యోగులకు భృతి ఇస్తామనీ భరోసా ఇచ్చారు. వచ్చే కాలంలో దేశంలో ఒక ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆరోగ్య తెలంగాణ ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు.

ఒక్కటీ అమలు కాలే..

సిఎం కెసిఆర్ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదు. కృష్ణానది పరివాహక ప్రాంతంలో చేపల వేట కోసం మర బోట్ల ఏర్పాటు ఊసే ఎత్తడం లేదు. మద్దిమడుగు నుంచి మార్చాలకు బ్రిడ్జి ఏర్పాటు చేస్తే ఆంధ్రప్రదేశ్‌లో అనేక వ్యాపార కార్యక్రమాలు కుటుంబ సంబంధాలకు అవకాశం ఉంటుంది. అదీ కార్యరూపం దాల్చలేదు. ముఖ్యమంత్రి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మళ్లీ ఎన్నికల ప్రచారం కోసం జిల్లాకు రావడం పట్ల ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన పసిడి అక్రమ రవాణా

- ఆరు నెలల్లో 2 వేల కిలోల స్మగ్లింగ్
- అధిక పన్ను రేట్ల ఎఫెక్ట్



న్యూఢిల్లీ : భారత్‌లోకి అక్రమంగా తీసుకొచ్చిన బంగారం భారీగా పట్టుబడుతోంది. కేంద్ర ప్రభుత్వం పసిడిపై అమలు చేస్తున్న హెచ్చు పన్ను రేట్ల నుంచి తప్పించుకోవడానికి స్మగ్లర్లు అడ్డదారుల్లో దిగుమతి చేసుకుంటున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన కాలంలో బంగారం స్మగ్లింగ్ 43 శాతం పెరిగి 2,000 కిలోలుగా నమోదయ్యింది. ఈ మొత్తం బంగారం భారత్‌లోకి అక్రమంగా దిగుమతి అయ్యిందని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్ (సిబిఐసి) ఛైర్మన్ సంజయ్ కుమార్ అగర్వాల్ వెల్లడించారు. అత్యధికంగా మయన్మార్, నేపాల్, బంగ్లాదేశ్ సరిహద్దుల నుంచి భారత్‌లోకి బంగారాన్ని తీసుకొస్తున్నారన్నారు. గతేడాది ఇదే ఏప్రిల్ - సెప్టెంబర్ కాలంలో 1,400 కిలోలు, 2022-23లో మొత్తంగా 3800 కిలోలు పట్టుబడిందన్నారు. "బంగారం అక్రమ రవాణ పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయి. కేవలం కస్టమ్స్ సుంకం అధికంగా ఉండడం వల్లే కాదు. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లోని ధరలను బట్టి కూడా అక్రమ రవాణ పెరుగుతుంది." అని సంజయ్ కుమార్ మీడియాతో అన్నారు. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) రిపోర్ట్ ప్రకారం.. భారత్‌లో భారీ గిరాకీతో పాటు అధిక దిగుమతి సుంకం బంగారం స్మగ్లింగ్‌కు దారితీస్తుంది. బంగారంపై 12.5 శాతం కస్టమ్స్ డ్యూటీతో పాటు 2.5 శాతం ఎఐడిసి , మూడు శాతం ఐజిఎస్‌టి అమల్లో ఉంది. మొత్తంగా 18.45 శాతం పన్ను కట్టాల్సి ఉంటుంది. భారత్ బంగారం అవసరాల్లో అత్యధిక భాగం దిగుమతుల ద్వారానే సమకూరుతోంది.

ఐదో రోజూ మార్కెట్ల నేల చూపులు

- సెన్సెక్స్‌కు 523 పాయింట్ల నష్టం

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లలో పండుగ సీజన్ కానరావడం లేదు. వరుసగా ఐదో రోజు ఈక్విటీ మార్కెట్లు నష్టాలు చవి చూశాయి. బుధవారం బిఎస్‌ఇ సెన్సెక్స్ 523 పాయింట్లు కోల్పోయి 64,049కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 160 పాయింట్లు తగ్గి 19,122 వద్ద ముగిసింది. ఉదయం లాభాలతో ప్రారంభమైన మార్కెట్లు కాసేపటికే అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఇజ్రాయెల్- హమాస్ మధ్య ఆందోళనలు ఇన్వెస్టర్లల్లో విశ్వాసాన్ని సన్నగిల్లేలా చేస్తున్నాయి. మరోవైపు అమెరికాలో బాండ్ల రాబడులు పెరగడం, అధిక చమురు ధరలు, బంగారం కొనుగోళ్లు పుంజుకోవడం కూడా ఈక్విటీ మర్కెట్లపై ప్రభావం చూపుతున్నాయని నిపుణులు అభిప్రాయపడు తున్నారు. బిఎస్ఇలో మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.52 శాతం, 0.77 శాతం చొప్పున విలువ కోల్పోయాయి. సిప్లా, అపోలో హాస్పిటల్స్, ఎన్‌టిపిసి, అదాని ఎంటర్‌ప్రైజెస్, ఎస్‌బిఐ లైఫ్ సూచీలు ఒక్క శాతం మేర నష్టపోయాయి.

సంగారెడ్డిలో బిఆర్ఎస్ జెండా ఎగరవేస్తాం

- మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



అడ్వకేట్ ముఖిమ్‌ను కండువా కప్పి స్వాగతం పలుకుతున్న మంత్రి హరీశ్‌రావు

సంగారెడ్డిలో బిఆర్ఎస్ జెండా ఎగరేస్తామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో బుధవారం మన బిన్ ఫౌండేషన్ అధినేత, సుప్రీంకోర్టు అడ్వకేట్ ముఖిమ్ మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. సదాశివపేట పట్టణంలోని ముర్షత్ దర్గా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో న్యాయవాది ముఖిమ్ సాబ్, కౌన్సిలర్ ఇలియాస్ షరీఫ్, టిజెఎసి జిల్లా అధ్యక్షులు సత్తయ్య యాదవ్, అనుచరులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ జగ్గారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఎన్నో హామీలు ఇచ్చి ఐదేళ్ల నుంచి ప్రజల కంటికీ కనపడకుండా పోయారన్నారు. హైదరాబాద్‌లో ఉంటూ నియోజకవర్గాన్ని పట్టించుకోకుండా, ఇప్పుడొచ్చి నాకు ఓటేస్తే వచ్చే పదేళ్లలో సిఎం అవుతానని ప్రజలను మభ్య పెట్టడం సరికాదన్నారు. బిజెపి, కాంగ్రెస్ రెండూ ఒకటేనని విమర్శించారు. ఆరోగ్యం బాలేకున్నా ప్రజల మధ్యలో ఉన్న నాయకుడు చింతా ప్రభాకర్ అన్నారు. చింత ప్రభాకర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో హ్యాండ్లూమ్ కార్పొరేషన్ ఛైర్మెన్ చింతా ప్రభాకర్, రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల సంస్థ ఛైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, టిఎన్జీవో రాష్ట్ర మాజీ అధ్యక్షులు మామిళ్ళ రాజేందర్, సిడిసి ఛైర్మెన్ బుచ్చిరెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ చింత గోపాల్, మున్సిపల్ కౌన్సిలర్లు, మండల సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలకు భారీ షాక్

- రూ.1 లక్ష కోట్లకు జిఎస్‌టి నోటీసులు

న్యూఢిల్లీ : ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చింది. పన్ను ఎగవేతలకు పాల్పడిన సంస్థలకు జిఎస్‌టి అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆయా కంపెనీలకు దాదాపుగా రూ.1 లక్ష కోట్ల విలువైన షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు జిఎస్‌టి సీనియర్ అధికారి వెల్లడించారు. ప్రభుత్వం సవరించిన జిఎస్‌టి చట్టం ప్రకారం అక్టోబర్ 1 నుంచి విదేశీ ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలు భారతదేశంలో నమోదు చేసుకోవడం తప్పనిసరి. ఈ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఎలాంటి సంస్థలు రిజిస్టర్ కాలేదు. ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా పెట్టే బెట్టింగ్‌ల పూర్తి విలువపై 28 శాతం జిఎస్‌టి చెల్లించాలని ఆగస్టులో సవరించారు. కానీ ఇప్పటివరకు పన్ను చెల్లించని గేమింగ్ సంస్థలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. పన్ను చెల్లించని కంపెనీలపై ఇప్పటి వరకు సుమారు రూ.1లక్ష కోట్ల విలువైన నోటీసులు పంపిందని ఆ అధికారి పేర్కొన్నారు. అధిక పన్ను రేటుపై గేమింగ్ కంపెనీలకు, ప్రభుత్వానికి మధ్య వివాదం నెలకొంది. హెచ్చు పన్ను రేట్లను తగ్గించాలని.. శ్లాబు రేటు మార్చాలని ఆ రంగం డిమాండ్ చేస్తోంది.

తగ్గిన క్రెడిట్ కార్డ్‌ల వినియోగం



ముంబయి : అధిక ధరలు ప్రజల కొనుగోలు శక్తిని తగ్గిస్తున్నాయి. సాధారణంగా పండుగ సీజన్‌లోకొనుగోళ్లు పుంజుకోవడంతో పాటుగా క్రెడిట్ కార్డుల చెల్లింపులు పెరుగుతాయి. కాగా.. ఈ ఏడాది సెప్టెంబర్‌లో 4.2 శాతం తగ్గి రూ.1.42 లక్షల కోట్లకు పరిమితమయ్యాయి. ఇంతక్రితం నెల ఆగస్ట్‌లో రూ.1.48 లక్షల కోట్ల వ్యయాలు జరిగాయి. ఆర్‌బిఐ గణంకాల ప్రకారం.. ఇండుస్‌ఇండ్ బ్యాంక్ క్రెడిట్ కార్డుల వాడకం 10.9 శాతం వృద్ధి చోటు చేసుకుంది. మిగితా అన్ని ప్రధాన బ్యాంక్‌లు జారీ చేసే క్రెడిట్ కార్డ్‌ల వ్యయం తగ్గింది. ఎస్‌బిఐ, యాక్సిస్ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ క్రెడిట్ కార్డుల వ్యయాలు వరుసగా 8.9 శాతం, 8.4 శాతం, 4.9 శాతం,1.8 శాతం చొప్పున నెలవారీ క్షీణతను చవి చూశాయి. ఆగస్ట్, సెప్టెంబర్ మాసాల్లో క్రెడిట్ కార్డు లావాదేవీల సంఖ్య కూడా 7 శాతం పతనమై 49,440కి పడిపోయాయి. క్రితం సెప్టెంబర్‌లో ఇ-కామర్స్ వెబ్‌సైట్‌లలో, క్రెడిట్ కార్డ్‌ల ఖర్చు 3 శాతం తగ్గి రూ.92,879 కోట్లుగా నమోదయ్యింది. ఈ ఏడాది నవంబర్‌లో దీపావళి పండుగ వస్తోన్న నేపథ్యంలో అక్టోబర్‌లో అధిక క్రెడిట్ కార్డ్ వ్యయాలు చోటు చేసుకోవచ్చుని ఫిన్‌టెక్ సంస్థ కివీ సహ వ్యవస్థాపకుడు మోహిత్ బేడి పేర్కొన్నారు. దేశంలో నిరంతరం పెరుగుతోన్న ద్రవ్యోల్బణం వినియోగంపై ఆందోళన పెంచుతోంది. అధిక ద్రవ్యోల్బణం దృష్ట్యా ప్రజలు విచక్షణతో కూడిన వ్యయాలు చేస్తున్నారని ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ మైఖేల్ పాత్ర ఇటీవల పేర్కొన్నారు. ఇది అమ్మకాల వృద్ధిని మందగించేలా చేస్తోందన్నారు.

ఓన్లీ ఔట్ గోయింగ్.. నో ఇన్‌కమింగ్

- నేడు రాజగోపాల్‌రెడ్డి.. రేపెవరో?
- ఎన్నికల వేళ తుస్సుమంటున్న బిజెపి బాంబులు
- కొత్తగా ఈటల వర్సెస్ విద్యాసాగర్‌రావు పంచాయితీ
- న్యాయం చేయాలంటున్న హార్డ్‌కోర్ కార్యకర్తలు
- పార్టీ మారాలని వలస నేతలపై అనుచరుల ఒత్తిడి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల వేళ బిజెపికి బిగ్‌షాక్. తమ పార్టీలో గెలిచే తొలి అభ్యర్థి అని చెప్పుకుంటున్న రాజగోపాల్‌రెడ్డి హ్యాండిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నానని ప్రకటించారు. కెసిఆర్‌పై పోరాటంలో బిజెపి మెతక వైఖరి అవలంబిస్తోందంటూ బాంబు పేల్చేశాడు. 'బిజెపి వద్దు... కాంగ్రెస్‌లో చేరు' అని అనుచరులు, నియోజకవర్గ ప్రజలు ఒత్తిడి చేయడంతోనే తాను పార్టీ మారుతున్నానంటూ ప్రకటించాడు. రాజగోపాల్‌రెడ్డి బాటలోనే మరికొంత మంది సీనియర్ నేతలు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పే యోచనలో ఉన్నట్టు చర్చ నడుస్తుంది. ఏడాది కాలం పాటు తెలంగాణలో తామే అధికారంలోకి రాబోతున్నామంటూ హడావిడి చేసిన నేతలంతా మెత్తబడిపోయారు. ప్రస్తుతం కాంగ్రెస్ వర్సెన్ టిఆర్ఎస్ అనే మూడ్ ప్రజల్లోకి బలంగా వెళ్లడంతో ఐదారు నెలల కింద తారాజువ్వల్లా ఎగిసి పడిన నేతలు ఇప్పుడు తుస్సు బాంబుల్లా మారారు. ఘోరంగా ఓడిపోతే ఉన్న పరువు కాస్తా ఎక్కడ పోతుందో అన్న భయంతో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికే జంకుతున్నారు. ఈ జాబితాలో డికె అరుణ, వివేక్, విజయశాంతి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, తదితర కీలక నేతలంతా ఉన్నారు. మరి కొందరు కీలక నేతలు పార్టీనీ వీడబోతున్నట్టు జోరుగా ప్రచారం జరుగుతున్నది.



వినూత్న పోరాటం చేస్తున్న రవికుమార్

ఔట్ గోయింగ్

చేరికలకు ఎన్ని ప్రణాళికలు వేసినా ఆ పార్టీలో ఔట్ గోయింగే తప్ప ఇన్‌కమింగ్ లేని పరిస్థితి. గ్రామ, మండల స్థాయి నేతలను చేర్చుకుని చేరికలని పెద్దగా చేసి చూపెడుతున్నది. తెలంగాణలో కేసీఆర్‌ను ఓడించే శక్తి బిజెపినే అని భావించి ఆ పార్టీలో చేరి అక్కడ జరుగుతున్న పరిణామాలను చూసి జీర్ణించుకోలేక పార్టీని వీడిన వారి లిస్టు పెద్దగానే ఉంది.పార్టీని వీడిన వారిలో స్వామిగౌడ్, ఎన్నం శ్రీనివాస్‌రెడ్డి, దాసోజు శ్రవణ్‌కుమార్, మోత్కుపల్లి నర్సింహులు, రాపోలు ఆనందభాస్కర్, మాజీ మంత్రి చంద్రశేఖర్, ఎర్రశేఖర్, జిట్టా బాలకృష్ణారెడ్డి, పుష్పలీల, నాగం జనార్ధన్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, తదితర నేతలున్నారు.

అధిష్టానం కోర్టులో వేములవాడ పంచాయితీ

వేములవాడ నియోజవర్గంలో అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడం బిజెపి రాష్ట్ర నాయకత్వానికి తలకు మించిన భారంగా మారింది. మొదట ఈ సీటుపై బండి సంజయ్ ఆసక్తి చూపినప్పటికీ ఆ తర్వాత వెనక్కి తగ్గారు. మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు తనయుడు వికాస్‌రావు ప్రతిమ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ బిజెపి నుంచి సీటును ఆశిస్తున్నారు. అదే నియోజకవర్గం నుంచి తనను అభ్యర్థిగా ప్రకటించాలని కరీంనగర్ జడ్‌పి మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ పట్టుబడుతున్నారు. ఆ పార్టీ రాజన్నసిరిసిల్ల జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ కూడా టికెట్ ఆశిస్తున్నారు. ఆయనది స్వతహాగా వేములవాడ నియోజకవర్గమే. బిజెపి రాష్ట్ర నాయకులు ఎర్రం మహేశ్ కూడా సీటు ఆశించినప్పటికీ ఆయన బలంగా రేసులో లేరు. ఈటల రాజేందర్‌తో కలిసి తుల ఉమ బిజెపిలో చేరారు. అప్పటి నుంచి వేములవాడ నియోజకవర్గంలో పనిచేసుకుంటున్నారు. తుల ఉమకు ఈటల, వికాస్‌రావుకు విద్యాసాగర్‌రావు అండగా ఉండి టికెట్ కోసం తమ శక్తిమేర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సీటు విషయంలో ఎటూ తేల్చలేక రాష్ట్ర నాయకత్వం చేతులెత్తేసింది. ప్రకాశ్ జవదేకర్, సునీల్‌బన్సల్‌తో విద్యాసాగర్‌రావు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇదే విషయంపై ఈటల కూడా వారిపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో ఇప్పుడు పరిస్థితి ఈటల వర్సెస్ విద్యాసాగర్‌రావుగా మారింది.

న్యాయం చేయండంటూ ప్రదక్షిణలు

పార్టీ కోసం దశాబ్దాల తరబడి పనిచేస్తున్నా తమకు సీట్లు ఇవ్వకుండా వేరే పార్టీల నుంచి వచ్చిన డబ్బున్నవాళ్లకే సీట్లు కేటాయిస్తుండటంపై ఆ పార్టీ హార్డ్‌కోర్ నాయకులు గుస్సా అవుతున్నారు. తమకు న్యాయం చేయాలంటూ పార్టీ రాష్ట్ర కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. బిఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి జహీరాబాద్ నుంచి బిజెపి నుంచి టికెట్ ఆశిస్తున్న ఢిల్లీ వసంత కుమార్ జాతీయ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. షాద్‌నగర్ నేతలు విష్ణువర్ధన్‌రెడ్డి తనకు టికెట్ ఇవ్వాలని ఆఫీస్ చుట్టూ తిరుగుతున్నారు. అక్కడ నుంచి మాజీ ఎంపి జితేందర్‌రెడ్డి కుమారుడు మిథున్‌రెడ్డి సీటు ఆశిస్తున్నారు. జనగామలో బలమైన బీసీ సామాజిక తరగతికి చెందిన నేత బి బీరప్పకు టికెట్ ఇవ్వకుండా దస్మంతరెడ్డికి ఇవ్వడం కొత్త పంచాయితీకి దారితీసింది. ఏండ్లతరబడి పనిచేస్తున్న బీరప్పకు టికెట్ ఇవ్వకపోవడంపై ఆ పార్టీ శ్రేణులు ఆగ్రహంతో ఆందోళనలు చేస్తున్న పరిస్థితి ఉంది.

రవికుమార్ వినూత్న పోరాటం

ధర్మపురిలో ఎంతో కాలంగా బిజెపిలో ఉన్న తనకు కాదని వేరేవారికి టికెట్ ఇవ్వడంపై రాయిల్ల రవికుమార్ రాష్ట్ర నాయకత్వంపై వినూత్న పోరాటం చేస్తున్నారు. తనకు ధర్మపురి అసెంబ్లీ బిజెపి టికెట్ ఇచ్చి న్యాయం చేయాలని కోరుతూ ధర్మపురి నుంచి హైదరాబాద్ కార్యాలయం వరకు సైకిల్‌పై 'విజ్ఞప్తి యాత్ర' చేపట్టారు. తెలంగాణ ఉద్యమంలో, మోడీ ప్రధాని కావాలని తాను చేపట్టిన సైకిల్ యాత్ర, సంస్థాగతంగా పట్టులేని చోట పార్టీ బలోపేతం కోసం తాను చేసిన కృషిని వివరిస్తూ రాష్ట్ర కార్యాలయం వద్ద నేతలను కలిసి మొరపెట్టుకుంటున్న పరిస్థితి కనిపించింది.

నర్సాపూర్ బిఆర్ఎస్ అభ్యర్థిగా సునీతా లక్ష్మారెడ్డి

- బి ఫామ్ అందజేసిన కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



సునీతా లక్ష్మారెడ్డికి బి ఫామ్ అందజేస్తున్న కెసిఆర్

మెదక్ జిల్లా నర్సాపూర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సునీతా లక్ష్మారెడ్డిని ఆ పార్టీ అధినేత, సిఎం కెసిఆర్ ప్రకటించారు. ఈ మేరకు బుధవారం నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి సిఎం కెసిఆర్.. ఆమెకు బిఫామ్ అందజేశారు. ప్రస్తుతం నర్సాపూర్ ఎమ్మెల్యేగా కొనసాగుతోన్న మదన్‌రెడ్డికి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ ఎంపి అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని పార్టీ నిర్ణయించింది. పార్టీలో అంతర్గత సర్దుబాటు చేస్తూ, అధినేత సిఎం కెసిఆర్ ఆధ్వర్యంలో భేటీ అయిన బిఆర్ఎస్ కోర్ కమిటీ సభ్యులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. పార్టీ సభ్యులు ఏకగ్రీవంగా తీసుకున్న నిర్ణయం పట్ల సిఎం కెసిఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "మదన్‌రెడ్డి నాతో పాటు మొదటి నుంచి పార్టీలో కొనసాగుతోన్న సీనియర్ నాయకుడు. 35 ఏళ్ల నుంచి నాకు అత్యంత ఆప్తుడు.. కుడి భుజం లాంటివాడు. పార్టీ ఆలోచనలను గౌరవించి నర్సాపూర్ ఎన్నికలను తన భుజాలపై వేసుకుని.. సునీతా లక్ష్మారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించే బాధ్యత తీసుకున్నందుకు సంతోషంగా ఉంది. ప్రస్తుతం కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎంపిగా కొనసాగుతోన్న మెదక్ స్థానం నుంచి మదన్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలని పార్టీ నిర్ణయించింది. వారి సీనియారిటీని పార్టీ గుర్తించి, గౌరవించినందుకు కార్యవర్గాన్ని అభినందిస్తున్నా. మదన్‌రెడ్డి మెదక్ జిల్లాలో అత్యంత ప్రజాదరణ కలిగిన నేత, జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పాపులర్ లీడర్. ఆయన సేవలను పార్టీ మరింత గొప్పగా వినియోగించుకోవాల్సి ఉంది. సునీతకు నర్సాపూర్ నియోజకవర్గ బీ ఫామ్ ఇవ్వడం నాకు సంతోషాన్ని కలిగించింది. చిన్న చిన్న సర్దుబాట్లు చేసుకుంటూ కీలక సమయంలో ఐక్యంగా ముందుకు పోవడం ద్వారా మదన్‌రెడ్డి తన ప్రతిష్ఠను మరింత పెంచుకున్నారు. వారికి నా ధన్యవాదాలు, అభినందనలు" అని తెలిపారు.

పాలస్తీనాపై దాడులు ఆపాలి

- నవంబర్ 28న మానవహారాలు, సంఘీభావ సభలు : సిఐటియు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను వెంటనే ఆపాలనీ, పాలస్తీనాకు సంఘీభావం తెలపాలని కోరుతూ నవంబర్ 28న జిల్లా, మండల కేంద్రాల్లో సిఐటియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మానవహారాలు, సంఘీభావ సభలు నిర్వహించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ కోరారు. అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్ వంటి పశ్చిమ దేశాల అండతో అక్టోబర్ ఏడు నుంచి పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధకాండను, అమానుష దాడులను తీవ్రంగా ఖండించారు. పాలస్తీనాకు సంఘీభావంగా, సామ్రాజ్యవాద యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా మానవహారాలు, సంఘీభావ ప్రదర్శనలు, సభల్లో ఉద్యోగులు, కార్మికులు వేలాదిగా పాల్గొనాలని కోరారు. ఇజ్రాయిల్ అమానుష దాడుల్లో రెండు వేల మందికి పైగా చిన్నారులతో సహా సుమారు ఆరు వేల మంది చనిపోయారనీ, 18 వేల మంది తీవ్రంగా గాయపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 10 లక్షల మంది శరణార్థులుగా మారారని వాపోయారు. చిన్నారులు, క్షతగాత్రులకు వైద్యం అందించేందుకు గాజా ఆస్పత్రులకు జనరేటర్లకు కావలసిన ఇంధనాన్ని కూడా సరఫరా కాకుండా అడ్డుకోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) సైతం గాజాకు మానవతా సహాయం అత్యవసరంగా పొందాల్సి ఉందనీ, అంతర్జాతీయ సమాజానికి చేసిన విజ్ఞప్తి తీవ్రతను వెల్లడిస్తున్నదని తెలిపారు. గాజాలో కొనసాగుతున్న దాడులు మధ్య ప్రాచ్యానికి వ్యాపించి ప్రాంతీయ ఘర్షణలుగా పెచ్చరిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ యుద్ధోన్మాద వైఖరిని ప్రపంచ హ్యూమన్ రైట్స్ వాచ్ సంస్థ కూడా తీవ్రంగా విమర్శించిందని తెలిపారు. ఇప్పటికైనా ప్రపంచ వ్యాప్తంగా శాంతి కాముకులు కోరుతున్న విధంగా పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపకపోతే రాగల పరిణామాలు తీవ్రంగా ఉంటాయని చెబుతున్న విషయాన్ని పేర్కొన్నారు.

ఇబ్బందులున్నాయి... పార్టీ వీడే ఉద్దేశం లేదు

- మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



పాము తన పిల్లలను తానే తిన్నట్లు.. తమ పార్టీ వాళ్లే ఇబ్బందులు తెస్తున్నారని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆరోపించారు. నల్గొండలో నిర్వహించిన మీడియా సమావేశంలో బుధవారం గుత్తా మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యేలతో విభేదాల కారణంగా కొందరు పార్టీని వీడుతున్నారని, కానీ తనకు పార్టీ మారే ఉద్దేశం లేదన్నారు. "ప్రస్తుతం రాజకీయాల్లో కొత్త ట్రెండ్ నడుస్తోంది. ప్రతి అంశాన్ని రాజకీయం చేయటమే ప్రతిపక్ష పార్టీలు పనిగా పెట్టుకున్నాయి. మేడిగడ్డ విషయంలో అదే జరుగుతోంది. ప్రకృతి వైపరీత్యాలు, సాంకేతిక లోపాలను ఎత్తిచూపుతూ ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే కెసిఆర్ మరోసారి సిఎం కావాలి. బిఆర్ఎస్ విజయం కోసం అందరూ కలిసి పనిచేయాలి. మూడోసారి కెసిఆర్ విజయాన్ని ఎవరూ ఆపలేరు" అని తెలిపారు. "పార్టీ ఆదేశిస్తే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉన్నాను. ఎంపి ఎన్నికల్లో నేను లేదా నా కుమారుడు పోటీ చేస్తాం. ఏ పార్టీలో ఉన్నా ఆ పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తా. ఈ వయసులో పార్టీలు మారాల్సిన అవసరం నాకు లేదు. అవసరమైతే ఈ పార్టీ నుంచి ఇప్పుడే పోటీ చేసే వాడిని. పక్క పార్టీలోకి వెళ్లి పోటీ చేయాల్సిన అవసరం లేదు" అని గుత్తా వ్యాఖ్యానించారు.

రేవంత్ రెడ్డితో ప్రాణహాని

- డిజిపికి కురవ విజయ్‌కుమార్ ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వల్ల తనకు ప్రాణహాని ఉందని రాష్ట్ర డిజిపి అంజనీ కుమార్‌కు టిపిసిసి ప్రచార కమిటీ సభ్యులు కురవ విజయ్ కుమార్ బుధవారం ఫిర్యాదు చేశారు. అనంతరం విజయ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. తమ ఫిర్యాదుపై డిజిపి సానుకూలంగా స్పందించారన్నారు. తక్షణమే విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కోసం 15 ఏళ్లుగా అహర్నిశలు పని చేసిన తనను కాదని, నిన్నమొన్న పార్టీలో చేరిన వ్యక్తికి గద్వాల టికెట్ ఇచ్చారని పేర్కొన్నారు.

రేవంత్ రెడ్డి డబ్బులకు, భూములకు ఎమ్మెల్యే టికెట్లను అమ్ముకుంటున్నారని తెలిపారు. ఎమ్మెల్యే టికెట్ల విషయంలో రేవంత్ రెడ్డి డబ్బులు తీసుకోకపోతే.. భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి అక్రమ ఆస్తులపై విచారణ జరపాలని ఇడికి ఫిర్యాదు చేశామని, ఈ నేపథ్యంలో ఆయన అనుచరులు తమను భౌతికంగా వేధిస్తున్నారని విజయ్ కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పని చేసి, గత 15 ఏళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తుంటే, ఇవాళ అకారణంగా తనను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన తమను అణగదొక్కడానికి రేవంత్ కుట్రలు చేస్తున్నారని విజయ్ కుమార్ మండిపడ్డారు.